క్లుప్తంగా

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తలెత్తిన డ్రైనేజీ సమస్య



ఎంఆర్ఆర్ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లో గత ప్రభుత్వ హయాంలో డ్రైనేజీ వ్యవస్థను చిన్నాభిన్నం చేయడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయిని ఏఐసీసీ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని అల్మాస్‌గూడ 24, 26 డివిజన్‌లలోని ఎంఆర్ఆర్ కాలనీ, సాయిహోమ్స్, వెంకటేశ్వర కాలనీల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ లైన్లను ఆయన పరిశీలించారు. కాలనీల్లో స్థానికులు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో వెంకటాచారి, మాధవరెడ్డి, తారాచంద్, వీరులాల్, మోహన్ తదితరులు ఉన్నారు.

చెత్త కుప్పలు తొలగించండి



రోడ్‌పై పేరుకుపోయిన చెత్త

మలక్‌పేట: మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధంగా మారుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం సిబ్బంది నిర్లక్ష్యంతో కాలనీలన్నీ కంపు కొడుతున్నాయని ఆయా ప్రాంతాల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల వద్దకు వచ్చే చెత్త తరలింపు వాహనాలు కొన్ని ప్రాంతాలకే వెళ్తున్నాయని ఫుట్‌పాత్‌లపై పేరుకుపోయి చెత్తకుప్పలతో నడిచేందుకు వీలు లేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. శాలివాహననగర్, సలీంనగర్, ఎస్‌బీహెచ్‌కాలనీ ఈస్ట్‌ప్రశాంత్‌నగర్ ఫుట్‌పాత్‌లపై పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని కోరుతున్నారు.

జహంగీర్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: జహంగీర్‌నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని జహంగీర్‌నగర్‌లో ఆయన పర్యటించగా రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్, హరీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: హయత్‌నగర్‌లోని దసరా గుడి ప్రాంగణంలో ఆదివారం బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, పారంగ రమేష్, స్కైలాబ్, సాయిచంటి పాల్గొన్నారు.

ఘనంగా యోగా సమోరోహ

మన్సూరాబాద్: డివిజన్ పరిధి మహావీర్ హరణి వనస్థలి జాతీయ పార్కు ప్రధాన గేటు వద్ద వాకర్స్ అసోసియేషన్, భారతీయ యోగా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం యోగా సమారోహ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో వివిధ యోగాసానాలు వేయించి యోగాతో కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు.



కందుకూరు: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మాజీ సర్పంచ్ రాంరెడ్డి



తుక్కుగూడ: సర్దార్‌నగర్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మాజీ కౌన్సిలర్ సుమన్



మహేశ్వరం: మహేశ్వరంలో ఇటుక బట్టీలలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు

పోలియో రహిత సమాజమే లక్ష్యం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత

- ఊరూరా పల్స్ పోలియో కార్యక్రమం
- పాల్గొన్న వైద్య సిబ్బంది, అధికారులు, నాయకులు

కందుకూరు: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత అన్నారు. ఆదివారం కందుకూరు పీహెచ్‌సీ పరిధిలో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. మరో రెండు రోజుల పాటు సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలను వేయాలన్నారు. ఫౌల్ట్రీ ఫామ్‌లు, ఇటుక బట్టీల వద్ద ఉన్న చిన్నారులను విస్మరించొద్దని ఆదేశించారు. కాగా మొత్తం మండలంలో 92.17 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారి ఉమేరా సుల్తానా తెలిపారు. మండలంలో 22 బూత్‌లలో 4,129 మంది చిన్నారులకు గాను మొదటి రోజు 3,806 మందికి పోలియో చుక్కలు వేశామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రఫీక్, డీపీఎంఓ సుదర్శన్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్ సరస్వతి



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న కాంగ్రెస్ నేత షేక్ జహంగీరుద్దీన్

పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి

పహాడీషరీఫ్: ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కాంగ్రెస్ పార్టీ జల్‌పల్లి కో–ఆర్డినేటర్ షేక్ జహంగీరుద్దీన్ సూచించారు. ఈ సందర్భంగా జల్‌పల్లిలో పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు. కార్యక్రమంలో నాయకులు చింతకింది నవీన్‌గౌడ్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా వేయించాలి

మహేశ్వరం: చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డా.కల్పన అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యాక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మహేశ్వరం: దుబ్బచర్లలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి కల్పన



పహాడీషరీఫ్: రంగనాయకుల కాలనీలో పోలియో చుక్కలు వేస్తున్న మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్‌యాదవ్

వరదతో పేరుకున్న నాచు

జారిపడుతున్న జనాలు

- నెలరోజుల నుంచి వేధిస్తున్న సమస్య
- పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట్: వర్షాలు తగ్గినా వరదనీరు ఆగకపోవడంతో కాలనీ రోడ్లన్నీ ప్రమాదకరంగా మారాయి. పట్టించుకోల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపల్ పరిధిలోని సాగర్‌రోడ్డులోని గుర్రంగూడ పరిధి కిందకు వచ్చే హరితపురి కాలనీలో వరదనీరు నెలరోజుల నుంచి వస్తుండడంతో గత నెలలో కాలనీవాసులు సమస్య పరిష్కరించాలని కోరుతూ.. కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అలాగే అల్మాస్‌గూడలోని సీవైఆర్ కాలనీలోని రోడ్ నెంబర్–4లో 40 రోజులనుంచి ఆగకుండా వరదనీరు పారుతూనే ఉంది. దీంతో కాలనీ రోడ్డంతా నాచు పేరుకుపోయింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేవారు బైకులతో అదుపుతప్పి పడిపోతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వరదనీరు కాలనీలకు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకొంటున్నారు.



హరితపూరి కాలనీలో పారుతున్న వరదనీరు



సీవైఆర్‌కాలనీలో జారిపడ్డ వాహనదారుడు

పార్కు స్థలాలు మున్సిపల్‌కు రిజిస్ట్రేషన్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో ఉన్న రెండు పార్కు స్థలాలను, అలాగే స్విమ్మింగ్‌పూల్‌ను బడంగ్‌పేట్ మున్సిపల్‌కు శనివారం రిజిస్ట్రేషన్ చేశారు. ఆదివారం శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో అసోసియేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యులుగా మాజీ కార్పొరేటర్ కవిత, అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్, పార్కులను ప్రభుత్వానికి చెందే విధంగా రిజిస్ట్రేషన్ చేయడంపై కాలనీవాసులకు అభినందనలు తెలిపారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్‌కుమార్ తన హయాంలో నిర్ణయం తీసుకోవడం గర్వించదగిన విషయమన్నారు. ఈ కాలనీని స్ఫూర్తిగా తీసుకొని కార్పొరేషన్‌లో ఏర్పడ్డ కాలనీలకు కేటాయించిన పార్కు స్థలాలను, ఓపెన్ ప్లాట్లను, ఇతర అవసరాల కోసం వదిలివేసిన వాటిని ముందుగా మున్సిపల్‌కు చెందే విధంగా ఆయా వెంచర్‌దారులు అప్పగిస్తే మంచిదన్నారు. ఈ నిర్ణయానికి మూకుమ్మడిగా ఒప్పుకున్న కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు. ముందుకొచ్చిన శ్రీశ్రీ ఎస్టేట్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎండీ భూపతిరాజు, పల్లపు శ్రీనివాస్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న రామిడి రాంరెడ్డి, కాలనీ పెద్దలు

ఆర్థికసాయం అందజేత



పూజారి లక్ష్మణాచారికి నగదు అందజేస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రాఘవరావు

బడంగ్‌పేట్: వారం రోజుల క్రితం ప్రమాదానికి గురై రెండు కాళ్లు కోల్పోయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి ఆదివారం బడంగ్‌పేట బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. నవీన్ తండ్రి అల్మాస్‌గూడ శిరిడీనగర్ కాలనీలోని శ్రీగోదా లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో లక్ష్మణాచార్యులు ఆలయ పూజారిగా రూ.8వేల వేతనానికి పనిచేస్తున్నారు. మందమల్లమ్మ చౌరస్తాలో ఇసుకమేట వేయడంతో అదుపు తప్పి బైక్‌తో పాటు కింద పడగా అదే సమయంలో వచ్చిన ఇటుకలారి నవీన్ రెండు కాళ్ల మీది నుంచి వెళ్లిపోయింది. చంపాపేట్‌లోని ఓ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక పరిస్థితిని చూసి చలించిన బ్రాహ్మణ సేవా సంఘం ఆయనకు అండగా నిలిచింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షురాలు వేముల కవిత, బీఎల్ నవీన్‌కుమార్, నండూరి ప్రకాశ్, శ్రీనివాసరావు, శంకర్‌రావు, సౌమిత్రి, హరికృష్ణ, రంగారావు తదితరులు ఉన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

పహాడీషరీఫ్: ఎన్‌డీఏ సర్కార్ ఓటు చోరీతోనే మూడోసారి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి 12వ డివిజన్ అధ్యక్షుడు ఆదిల్ల జంగయ్య ఆధ్వర్యంలో మామిడిపల్లిలో ఆదివారం ఓటు చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. ఓటు చోరీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందనానార్నరు. కార్యక్రమంలో కుమార్, విజయ్, నరేందర్, కృష్ణ, బాలకృష్ణ, రామునాయక్, రాంబాబు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురంలోని రైతుబజారులలో కూరగాయల ధరలు. టమాట రూ.23, వంకాయ 45, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 38, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 50, దొండ 28–35, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 45, క్యాప్సికం 60, ఆలు 23, దోస 18, సొర 15, పొట్ల 23, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 23. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆటస్థలం అభివృద్ధికి కృషిచేస్తా



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసిన అసోసియేషన్ సభ్యులు

నాగోలు: బండ్లగూడ ఫతుల్లాగూడలో గతంలో ఆటస్థలం కోసం కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేసిన అందుబాటులో తీసుకురావాలని ఆదివారం జైపురికాలనీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. గతంలో జైపురికాలనీ పరిసర ప్రాంతంలో ఆటస్థలం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఫతుల్లాగూడలో ప్రభుత్వం స్థలం కేటాయించారు. కానీ.. అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయకపోవడంతో చిన్నారులు ఆటస్థలం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేసి అందుబాటులో తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరగా త్వరలోనే ఆట స్థలం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం



నిరాహార దీక్షలో కూర్చున్న రిజర్వేషన్ల సాధన సమితి సభ్యులు

షాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేదాకా పోరాటాలు చేస్తామని బీసీ రిజర్వేషన్ల సతిమి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిచరాహార దీక్షలు చేపట్టారు. సాయంత్రం మండల కురుమ సంఘం అధ్యక్షుడు మద్దూరు పాండు వారికి నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జడల రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, తమ్మలి రవీందర్, రమేశ్‌యాదవ్, చేవెళ్ల స్వామి, గడ్డం చంద్రయ్య, రాపోల్ నర్సింలు, మద్దూరు పాండు, ఒగ్గు రాజు, రాము శ్రీశైలం, శేఖర్, సుదర్శన్, హరికృష్ణ, సత్యం, చందిప్ప జంగయ్య, గోపాల్, సత్యనారాయణ, మల్లయ్య, బీరయ్య, ఆంజనేయులు, హరికుమార్, విఠలయ్య, హనుమంతు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎంతో కృషి చేస్తున్నారని ఆలూరు మాజీ సర్పంచ్ అనంతరాములు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గోపులారం యాదమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదిరెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరులో హెచ్‌ఎండీఏ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు తీసుకొస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెస్కారి రాజు, తలారి రాజు, అశోక్, సునీల్‌కుమార్, సుదర్శన్, శంకరయ్య, నర్సింలు, ఆనందం, రుక్కయ్య, జంగయ్య, బాల్‌రాజ్, శ్రీనివాస్, ప్రశాంత్ వెంకటేశ్, బుచ్చయ్య, రాజు, మహేందర్ తదితరులు ఉన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న గ్రామ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె

షాద్‌నగర్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫోజ్‌జహాన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక శీతాకాల శిబిరం ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని వీధులలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. స్వచ్ఛతపై నినాదాలు రాయడంతో పాటు పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దీంతో రోగాలు దరి చేరవన్నారు. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తకుండీల్లో వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యంపానం, ధూమపానం, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అరుణఅంజయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్, అధ్యాపకులు కళాజ్యోతి, పరమేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

మన్సూరాబాద్: పద్మశాలీలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. మహావీర్ హరణివనస్థలి జాతీయ పార్కు ప్రాంగణంలోని అనన్య ఎకో పార్కులో ఆదివారం నిర్వహించిన పద్మశాలి రాష్ట్రస్థాయి దసరా మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేళాలో ఉచిత వైద్య శిబిరం, వివాహ పరిచయ వేదిక, ఉచిత న్యాయ సలహాలను అందించారు. మహిళలకు ఆటలపోటీలు నిర్వహించిన ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, పున్న గణేష్‌నేత, కర్నాటి వెంకటేశం, కొకుంట్ల రవితేజ, సుధాకర్, గడ్డం లక్ష్మినారాయణ, బురుగు తులసీదాస్, సీత ఆంజనేయులు, గుర్రం శ్రావణ్, జెల్ల సూర్యకాంత, జగన్నాథం, తలాటీ రమేష్, గుర్రం విశ్వేశ్వర్, శ్రీనివాస్, ఊర్కొండ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.